జగనన్న వెంటే నడుస్తా



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలో నాలుగు రోజులుగా తాను లేనని, అయితే తనపై కొందరు ఇష్టానుసారంగా వార్తలను వ్యాప్తి చేస్తున్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని 39వ డివిజన్లో గల పెద్దబజార్, డైకస్ రోడ్డులో చేపల మార్కెట్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన మటన్ మార్కెట్‌ను గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తనను తిడుతూ యూట్యూబ్‌లో పెడితే డబ్బులొస్తాయంటే తనకేమీ ఇబ్బంది లేదని చెప్పారు. తాను రాజకీయాల్లో ఉన్నంత కాలం జగనన్న వెంటే నడుస్తానని, ఆయన కోసమే పనిచేస్తాననే విషయాన్ని చనిపోయిన తన తండ్రి సాక్షిగా చెప్తున్నానన్నారు. తాను ఎమ్మెల్యే అయినా, మంత్రి పదవిని అనుభవించినా జగనన్న పెట్టిన భిక్షేనని చెప్పారు. ఓ వ్యక్తికి తాను నచ్చకపోయినా దూరంగా ఉంటానే తప్ప అవతలి వారు నాశనమవ్వాలని కోరుకునే మనస్తత్వం కాదన్నారు. నచ్చని వారికి దూరంగా ఉంటూ దాని ప్రకారమే తాను ప్రయాణం సాగిస్తున్నానని, ఈ కారణంగానే తనతో కొందరికి విభేదాలు ఉండొచ్చన్నారు. ఏడాదిగా తనను ఎందరో విమర్శించారని, దీనికి తాను నేరుగా సమాధానమిచ్చానే గానీ సీఎం దృష్టికి తీసుకెళ్లలేదని తెలిపారు.

50 దుకాణాల కేటాయింపు

మటన్ మార్కెట్‌ను ప్రారంభించి దాదాపు 50 దుకాణాలను కేటాయించామని చెప్పారు. గతంలో మటన్ మార్కెట్‌ను నిర్మించారని, అయితే వెంటిలేషన్ లేకపోవడంతో వారందరూ ఇబ్బందులు పడేవారని తెలిపారు. దీంతో డిజైన్‌ను మార్చి నిర్మించామని వెల్లడించారు. ఎవరెవరికి ఏ దుకాణాలు కేటాయించుకోవాలో మటన్ మార్కెట్ పెద్దలకే వదిలేశామని తెలిపారు. ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మీరామొహిద్దీన్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, ముస్లిం సంచార జాతుల చైర్‌పర్సన్ ఆసిఫా, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మురుగునీటి శుద్ధి కేంద్రాలు



పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): మురుగునీటి శుద్ధి కేంద్రాలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 53, 54వ డివిజన్ల పరిధిలోని మురుగునీరు కాలువల ద్వారా ప్లాంట్‌కు చేరుతుందని, రీసైక్లింగ్ ద్వారా సురక్షిత నీరుగా మార్చి వ్యవసాయావసరాలకు వినియోగించనున్నామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణకు గానూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించిన విధివిధానాలను పటిష్టంగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా నగరంలో నిర్మించిన అన్ని మురుగునీటి శుద్ధి కేంద్రాలను త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నామని వెల్లడించారు. వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఈ అలీ, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, డీఈ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో వసతులు కల్పించండి

నగరంలోని అన్ని పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని స్వతంత్ర, పినాకినీ, ఆదిత్యనగర్‌లోని బాలసుబ్రహ్మణ్యం, చిల్డ్రన్స్ పార్కులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను పార్కుల్లో కల్పించాలని సూచించారు. పార్కుల్లో అవసరమైన క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయాలన్నారు. చిల్డ్రన్స్ పార్కులో జీవ వైవిధ్య ప్రదర్శనశాల పనులను త్వరితగతిన పూర్తి చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మరమ్మతులకు గురైన ఆట వస్తువులు, క్రీడా పరికరాల స్థానంలో నూతన పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, డీఈలు అనిల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రోడ్ల నిర్మాణాల పూర్తి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): రాజారామిరెడ్డినగర్, పరిసర ప్రాంతాల్లోని ఆరు వీధుల్లో రూ.20 లక్షలతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. 31వ డివిజన్లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను కార్పొరేటర్ మంజులతో కలిసి గురువారం పరిశీలించారు. చవటమిట్ట గిరిజన కాలనీలోని శ్మశాన వాటికలను సందర్శించారు. మురుగుతో అపరిశుభ్రంగా ఉందని, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.ఐదు లక్షలతో శ్మశాన లెవలింగ్ పనులను చేపట్టాలని సూచించారు. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సుబేదారుపేటకు చెందిన లక్ష్మీహారతి, కనకలింగేశ్వరరావుకు పెద్దల సమక్షంలో 2012లో వివాహమైంది. ఆ సమయంలో లక్ష్మీహారతి కుటుంబసభ్యులు 15 సవర్ల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి వస్తువులను కట్నం కింద కనకలింగేశ్వరరావుకు ఇచ్చారు. అదనపు కట్నం కోసం కొంతకాలంగా భర్త, అత్తింటివారు ఆమెను వేధించసాగారు. ఇటీవల ఆమెను ఇంటి నుంచి గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

• అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన కవితకు తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణతో వివాహమైంది. ఆ సమయంలో రూ.ఐదు లక్షల నగదు, 30 సవర్ల బంగారు, రూ.లక్ష విలువైన ఇంటి సామగ్రిని కట్నంగా ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహమైన నాటి నుంచి భర్త, అత్తింటి వారు ఆమెను సూటిపోటి మాటలతో పాటు అదనపు కట్నాన్ని తీసుకురావాలంటూ వేధించడం ప్రారంభించారు. గతేడాది కవిత గర్భిణిగా ఉన్న సమయంలో ఇంటి నుంచి గెంటేశారు. బిడ్డకు జన్మనిచ్చాక భర్త వచ్చి చూసి వెళ్లారు. ఇప్పటి వరకు ఆమెను కాపురానికి తీసుకెళ్లలేదు. పెద్దల సమక్షంలో కాపురాన్ని చక్కదిద్దేందుకు ఆమె తల్లిదండ్రులు పలుమార్లు యత్నించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో భర్త, అత్తింటి వేధింపులపై పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటి వారిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన శ్రావణి, మల్లికార్జున దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఆటో మెకానిక్ పనులు చేస్తూ కుటుంబాన్ని మల్లికార్జున పోషిస్తున్నారు. భర్త, అత్తింటి వారు అదనపు కట్నం ఆమెను కొంతకాలంగా వేధించసాగారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శుక్రవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయ వీధి, బారాషహీద్ దర్గా, ప్రగతినగర్, లేక్‌వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన మేరిగ



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను ఆయన చాంబర్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మను కలిశారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ



నెల్లూరు రూరల్: పర్యావరణ పరిరక్షణపై దేవరపాళెం, నరసింహకొండ ప్రాంతాల్లో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డివిజన్ అటవీ శాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలని కోరారు. అటవీ అధికారులు శివరామకృష్ణ, శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు తగవు



మాట్లాడుతున్న రామ్మోహన్

నెల్లూరు రూరల్: గుడిపల్లిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయ స్థల విషయంలో టీడీపీ నేతలు తనపై అసత్య ప్రచారాలు చేయడం తగదని రెండో డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు గుడిపల్లిపాడులో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఆలయ స్థల వివాదంలో తనకెలాంటి సంబంధంలేదని చెప్పారు. నాగరాజు, హనుమా, వెంకటరత్నం, రవి, శివకుమార్, కనకయ్య, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్సెస్సెస్) నూతన కార్యవర్గాన్ని సమాఖ్య నేత ప్రసాద్ గురువారం ప్రకటించారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ శాఖ సలహాదారు శ్రీకాంత్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఏపీబీఎస్సెస్సెస్ ప్రధాన విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదనశర్మ (ఆదోని), ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తంశర్మ (తెనాలి), కోశాధికారిగా వెంకటసుబ్బారావు, యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా సీతారామ్ (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా శంకర్ (నెల్లూరు), అర్చక పురోహిత విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ (కాణిపాకం), ప్రధాన కార్యదర్శిగా అయ్యప్పశర్మ (జగ్గంపేట), రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రవికిరణ్‌శర్మ (బొట్లగూడూరు), సహాయ ప్రచార కార్యదర్శిగా బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా శరవణ మహేష్, శ్రావణ్, రాజా (నెల్లూరు)ను ఎన్నుకున్నామన్నారు. జిల్లా కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకోనున్నామని వివరించారు.

చేనేత పరిరక్షణకు జీఎస్టీని రద్దు చేయాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చేనేతల పరిరక్షణ కోసం జీఎస్టీని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు కోరారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గాంధీనగర్ వద్ద ఆప్కో స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని చేనేత కార్మికులు, అనుబంధ వృత్తుల వారికీ వర్తింపజేయాలని పేర్కొన్నారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రేబాలవారి వీధిలోని జిల్లా జౌళి శాఖాధికారి కార్యాలయం వద్ద శనివారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘ జిల్లా నేతలు తిరుపాల్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న వెంకటప్రసాద్

నెల్లూరు(అర్బన్): గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలను తప్పక చేయాలని ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్ల కౌన్సెలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో ఎవరికైనా హెచ్ఐవీ అని తేలితే వారిని వెంటనే హెచ్ఐవీ కేంద్రానికి తరలించి వైద్య చికిత్సలను అందించాలని కోరారు. వైద్యాధికారులు శివ, సురేంద్ర, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు



నెల్లూరు (టౌన్): నగరంలోని ఆరెస్సార్ ఉన్నత పాఠశాలలో శిక్షణకు హాజరైన 1998 ఎమ్టీఎస్ ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలను మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. షుగర్, బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, 1998 ఎమ్టీఎస్ ఉపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ పాటించాలి



డీఈఓకు వినతిపత్రమిస్తున్న బీటీఏ నేతలు

నెల్లూరు (టౌన్): హైస్కూల్ ప్లస్ పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని బీటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీకి వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. బీటీఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై రాయితో దాడి

నెల్లూరు(క్రైమ్): గొడవ చేయొద్దని సూచించిన వృద్ధుడిపై వ్యక్తి రాయితో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్‌కాలనీకి చెందిన లారీ క్లీనర్ బాబు బుధవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఆ ప్రాంతంలో గొడవచేయసాగారు. గొడవ చేయొద్దని అదే ప్రాంతానికి చెందిన కరీమ్ వారించారు. దీంతో ఆగ్రహానికి గురైన బాబు రాయితో వృద్ధుడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఇస్కాన్ సిటీలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

బాల రామాయణంపై 21 నుంచి శిక్షణ

నెల్లూరు(బృందావనం): శెట్టిగుంటరోడ్డులోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో బాల రామాయణం, నామరామాయణ సప్తాహాన్ని ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాయణంపై రోజూ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు బాలలకు కవి శిరోమణిశర్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నారని వివరించారు.

రికార్డుల పరిశీలన

పొదలకూరు: పట్టణంలోని సచివాలయంలో రికార్డులను నెల్లూరు డీఎల్పీఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండలంలో లేఅవుట్ల నిర్మాణంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టి దోమలు ప్రబలకుండా చూడాలని సూచించారు. ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీ అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో నిమ్మ, మామిడి తోటలకు నష్టం

పొదలకూరు: ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షంతో నిమ్మ, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని అంకుపల్లి, పులికల్లు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉధృతంగా వీచిన ఈదురుగాలులతో నిమ్మ తోటల్లో చెట్లు నేలకొరిగాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. గాలులకు విద్యుత్ స్తంభాల తీగలు తెగిపడ్డాయని రైతులు తెలిపారు. నీరు పారించిన నిమ్మ తోటల్లో చెట్లు అధికంగా నేలవాలాయన్నారు.

కారును ఢీకొన్న లారీ

• చిల్లకూరు తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్లకూరు తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్‌కు ప్రమాదం తప్పింది. వివరాలు.. కారులో నెల్లూరు నుంచి చిల్లకూరుకు తహసీల్దార్ వెళ్తుండగా, వెనుక నుంచి లారీ ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా కారును నడపడంతో తహసీల్దార్‌కు ప్రమాదం తప్పింది. స్వల్పంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో కొలువైన శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలోదేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, శ్యామ్‌ప్రసాద్, వేణుగోపాల్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఇందుకూరుపేట: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జనార్దన్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో తరగతిలో 40, నాలుగులో 35, ఐదులో 23, ఆరులో 28, ఏడులో ఆరు, ఎనిమిదిలో 15, తొమ్మిదో తరగతిలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. గిరిజన విద్యార్థులకు మాత్రమే సీట్లను కేటాయించనున్నారని, ఆసక్తి గల వారు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 97039 20372, 93467 10400 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాయినాథుడికి పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. భజనలు, స్వామివారి పల్లకిసేవను రాత్రి నిర్వహించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.